జూదాల పండుగ

ఆరు పదు నెనిమిదవ శతాబ్దపు మొదటి రోజులు. ఒరిస్సా కొండల నడుమనున్న ఆ గ్రామము చుట్టూ దట్టంగా అడవులున్నాయి. ఎర్రటి పువ్వులతో ఎల్లప్పుడూ ఆ గ్రామము మిక్కిలి అందంగా కనబడుతుండేది. తిరిగి తిరిగి అలసిపోయి ప్రక్కల ఉన్న కొండలమీద విశ్రాంతికి దిగిన మేఘాలతో ఆ పరిసర ప్రాంతం కన్నుల కింపుగా కనబడుతుండేది. ఆ గ్రామంలో నివసించే వారందరూ దృఢకాయులు. భూమిని దున్ని పంటలు పండించే కర్షకులు. వారికి డబ్బుతో పని ఉండేది కాదు. కావలసిన తిండి, బట్ట, మిగిలిన వాడుకోవటానికి పనికి వచ్చే పరికరాలు దొరుకుతాయి. మోసాలకు వారిదగ్గర ఏ మాత్రం తావు లేదు. నీతి నిజాయితీలే వారి వెంట అంటిపెట్టుకు ఉంటాయి.

పట్టణాలలో ఉన్నవారికి డబ్బు కావాలి. డబ్బు లేకపోతే వారు జీవితం గడుపలేరు. కాని పల్లెప్రజలు డబ్బుతో నిమిత్తం లేకుండా నెలలు నెలలు ఆనందంగా గడుపగలరు.

రామచంద్ర సుక్రోకు ఉన్నదల్లా ఒక ఎడ్లజత, మూడు ఎకరాల భూమి, నాగలి, విల్లమ్ములు, కట్టెలు కొట్టుకునే గొడ్డలి, భార్య "నిన్ని," చిన్న కొడుకు, ఇవే అతని ఆస్తి.

అతని స్నేహితుడు గంగాధరకు కూడా సుక్రో ఆస్తికన్న ఎక్కువ లేదు. వారిద్దరూ కష్టపడి పనిచేసి తమ జీవితాలను సంతోషంగా వెళ్ళబుచ్చుతుండేవారు.

ఆ కాలంలో ఆ పరిసర గ్రామాలలో ప్రతి ఏటా "జూదాలపండుగ" అని ఒక పండుగ జరుపుతుండేవారు. పంటలు పండించి, గింజలు ఇంటికి చేరవేసి సంతోషంగా ఉన్న సమయంలో ఆ పండుగ జరుపుతుండేవారు. ఆ పండుగరోజున పిన్నా పెద్దా అందరు జూదమాడి ఆనందంగా కాలం వెళ్ళబుచ్చేవారు. సాయంకాలం కాగానే స్త్రీ పురుషులందరూ కలసి నృత్యం చేసేవారు. డప్పులు కొడుతూ శ్రావ్యమైన కంఠాలతో, గొంతెత్తి పాటలుపాడుతూ, ఆనందం వెలిబుచ్చేవారు.

పండుగ దగ్గర పడింది. సుక్రో తనకు పండిన పంటలో కొంత భాగం ఇచ్చి నిన్నికి పూసలపేర్లు, బట్టలు మొదలైనవి బజారులో తీసుకున్నాడు. నిన్ని ఇంటిని శుభ్రంచేసి, మట్టితో నేల అలికి నేలమీద, గోడలమీద రంగు రంగుల ముగ్గులు పెట్టింది.

పండుగ నాటిరాత్రి ఆనందంగా గడపటానికి, కొంత సారాను వెదురు గొట్టాలలో పట్టి నిన్ని చేతికిచ్చాడు సుక్రో. నిన్ని పెంచుతున్న కోళ్ళలో ఒక కోడిపుంజును ఆనాటి రాత్రి విందుకు బలివ్వటానికి నిశ్చయించుకున్నారు.

పండుగ ముందురోజు ఆ గ్రామమంతా వింత వింత ముగ్గులతోను, పచ్చని తోరణాలుగల పందిళ్ళతోను కలకలలాడింది.

కొండపల్లి సాంబమూర్తి

పండుగనాడు ప్రాతఃకాలాన్నే లేచి శుభ్రంగా స్నానంచేసి గంగాధర్ కొరకు కాసుకూచున్నాడు సుక్రో. నిన్ని ప్రక్క ఇల్లాలితో కాలక్షేపం చేయటానికి వెళ్ళింది.

కొంతసేపటికి గంగాధర్ హుషారుగా వచ్చాడు.

"ఏం గంగాధర్! ఇంత ఆలస్యంగా వచ్చావేం? ఈవేళ పండుగని మర్చిపోయావా?" ప్రశ్నించాడు సుక్రో.

"లేదు సుక్రో! లేవటం కొంచెం ఆలస్యమయింది" అని కూర్చున్నాడు గంగాధర్.

"పాచికలు తెమ్మన్నావా?"

"తీసుకోనిరా సుక్రో! కాలక్షేపానికైనా కొంతసేపు ఆడాలిగా?" అన్నాడు గంగాధర్.

సుక్రో పాచికలు తెచ్చాడు. ఆట నుపక్రమించారిద్దరున్నూ.

"పందెం వేస్తావా?" అడిగాడు సుక్రో.

"కాలక్షేపం కొరకు ఆడుకునేదానికి పందెం ఎందుకు సుక్రో" అన్నాడు గంగాధర్.

"కాలక్షేపంకొరకు ఆడుకున్నా పందెం లేకపోతే ఆటమీద ఆసక్తి పుట్టదు గంగాధర్! ఏమాత్రమైన పందెం ఉంటే నే ఆట హుషారుగా సాగుతుంది" అన్నాడు సుక్రో.

"నీ ఇష్టమే కానీ సుక్రో" అన్నాడు గంగాధర్.

"నేను నా గొడ్డలి పందెంగా పెడుతున్నాను గంగాధర్"

"సరే! నేను నా గొడ్డలి పందెంగా పెడుతున్నాను"

ఆట ప్రారంభమైంది. గంగాధర్ గెలిచాడు. సుక్రో చిన్నబుచ్చుకున్నాడు.

"ఈసారి నా నాగలి పందెంగా పెడుతున్నాను"

సుక్రో ముఖంవైపు ఆశ్చర్యంగా చూశాడు గంగాధర్.

"ఎందుకులే సుక్రో నీ గొడ్డలి నీవే ఉంచుకో" అన్నాడు.

"అబ్బే! నాగొడ్డలి నీవు గెల్చుకున్నావు అది నీదే, ఆట సాగనీ" గద్దించాడు సుక్రో.

రెండో ఆటకూడా సుక్రో ఓడిపోయాడు. ఈసారి ఓడిపోవటంతో సుక్రోకు రోషం వచ్చింది.

"నా ఎడ్లను పందెం పెడుతున్నా" నన్నాడు.

"నేను నీవద్ద గెలిచిన నాగలి గొడ్డలి పందెం పెడుతున్నా" నన్నాడు గంగాధర్.

ఈసారి కూడ సుక్రో ఓడిపోయాడు.

"ఆటమాని నీ వస్తువులు నీవే తీసుకో" మని గంగాధర్ చెప్పాడు, కాని సుక్రో వినిపించుకోలేదు.

చేసేదిలేక సుక్రో పొలాన్ని పందెంగా అంగీకరించాడు. గంగాధర్ పాలైపోయింది. తర్వాత ఇల్లుకూడా ఓడిపోయాడు సుక్రో.

(30 వ పేజీ చూడండి)

(26 వ పేజీ తరువాయి)

"చెబితే విన్నావు కావు సుశ్రో! నీ పంతం నీదే కాని నా మాట వినిపించుకోవు కదా!" అన్నాడు గంగాధర్

సుశ్రో మౌనంగా తలదించుకున్నాడు

"అయిందేదో అయిపోయింది సుశ్రో, జరిగినదాన్ని మర్చిపోయి నీ ఆస్తిని నువ్వు తీసుకో అసలు మనం పందెం పెటలేదనుకో"

"లాభం లేదు గంగాధర్, నీవు గెలిచిన దాన్ని నాదనుకుని ఆత్మవంచన చేసుకోలేను అవన్నీ నీవే మళ్ళీ నేను గెలుచుకుంటేనే వాటిని తీసుకుంటాను"

"గెలుచుకోవాలంటే పందెం పెట్టాలి, పందెం వేయటానికి నిన్నీ పూసల పేర్లు తప్పించి, ఇంకేమీ నీవద్ద లేవు ఆ పూసల పేరు ఓడిపోయిన నీ ఆస్తికి సరితూగగలవా సుశ్రో" అన్నాడు గంగాధర్

నిన్నీ విషయం జ్ఞాపకం రాగానే సుశ్రోకి తన ఆస్తిని గెల్చుకోగలననే ఆశ మొలకెత్తింది

"నా ఆస్తికి పందెంగా నిన్నీని ఒడ్డుతున్నాను గంగాధర్! ఆట ప్రారంభించు" అన్నాడు సుశ్రో గంభీరంగా

సుశ్రో మాట విని గంగాధర్ త్రుళ్ళి పడ్డాడు

"ఏమిటన్నావ్ నిన్నీనా?" అన్నాడు ఆశ్చర్యంతో

"అవును నిన్నీనే"

"నీకేమైనా మతి చలించలేదు కదా?"

"లేదు గంగాధర్, నా ఆస్తి రాబట్టుకోవాలంటే ఇంకో మార్గం లేదు ఈ ఆట గెలిస్తే నా ఆస్తి నాకు దక్కుతుంది అప్పుడు నాకు అధర్మంగా ప్రవర్తించావని మాటరాదు లేకపోతే ఓడిపోయిన ఆస్తి అన్యాయంగా తిరిగి తీసుకున్నానని అపకీర్తి వస్తుంది ఆలోచించక ఆట ప్రారంభించు"

గంగాధర్ నిముషం సేపు స్తంభించి పోయాడు 'నిన్నీ' నిన్నీ సౌందర్యం ఒక్కసారి అతని కన్నులముందు మెరసింది నిన్నీ సౌందర్యవతి ఆమె సౌందర్యం ముందు ఆ గ్రామస్త్రీల సౌందర్యం ఎందుకూ పనికిరాదని గంగాధర్ కు తెలుసు

మౌనంగా ఆట ప్రారంభించాడు ఈసారి కూడా సుశ్రో ఓడిపోయాడు కాని సుశ్రో చలించలేదు అతని గంభీరవదనం చూసి గంగాధర్ కొద్దిగా జడిశాడు

"నా సర్వస్వం నీదే గంగాధర్" అన్నాడు సుశ్రో అతని కంఠం విని గంగాధర్ త్రుళ్ళి పడ్డాడు

'నీ ఆస్తిని, నీ భార్యని నీవే తీసుకో' అని ఈసారి గంగాధర్ అనలేక పోయాడు దీనికి కారణం నిన్నీ అపూర్వ సౌందర్యవతి గంగాధర్ కి సుశ్రో ఆస్తిపై ఆసక్తి లేదు. కాని సుశ్రో భార్య నిన్నీని తను గెల్చుకోవటంతో అతను 'నీ భార్యను నీవే తీసుకో' అని అనలేక పోయాడు

గంగాధర్ నోటినుండి "నీ భార్యను నీవే తీసుకో" అని మాట వస్తే, ఆస్తి అతనికిచ్చి భార్యతో ఇంకో గ్రామానికి వెళ్ళిపోవాలనుకున్నాడు సుశ్రో కాని గంగాధర్ నోటి నుండి ఆ మాట వెలువడక పోవటంతో సుశ్రో సమస్తం త్యజించటానికి సంసిద్ధుడయ్యాడు

సుమారు పావు గంట వరకు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

కొంతసేపటికి నిన్నీ వచ్చింది భర్త గంభీర వదనం చూసి నిన్నీ నిర్ఘాంతపోయింది

"పండుగపూట మిత్రులిద్దరూ మౌనంగా కూర్చున్నారేం?" అంది లేని చిరునవ్వు తెచ్చుకుంటూ

గంగాధర్ ఏదో చెప్పాలనుకున్నాడు కాని నోరు విప్పలేకపోయాడు కడకు సుశ్రో మెల్లగా పెదిమలు కదిపాడు

"నా సర్వస్వం, అంటే నీతో సహా గంగాధర్ కి ఓడిపోయాను నిన్నీ" అన్నాడు శుష్క స్వరంతో

నిన్నీ నిలుచున్న పాళంగా కొయ్యబారి పోయింది న్యాయానికీ, నీతికీ కట్టుబడి ఉన్న తన భర్తను చూసి స్తంభించిపోయింది కట్టుకున్న భార్యను జూదంలో ఓడిపోయాడా? తన భార్యను పందెం పెట్టాడా? ఆడదంటే ఆటబొమ్మ అనుకున్నాడా? ఎంత సాహసం కాని అతను తన భార్యను ఓడిపోయాడు న్యాయంగా తను గంగాధర్ తో వెళ్ళక తప్పదు

"నిన్నీ నేను న్యాయానికి కట్టుబడి ఉన్నాను నీవు గంగాధర్ తో వెళ్ళు నీవేమైనా అడ్డు చెప్పేవంటే నా ఆత్మను ఖూనీ చేసినదానివౌతావు ఇందులో నీ తప్పేమీ లేదు అంతా భగవంతుని లీల" అంటూ కన్నీరు తుడుచుకున్నాడు సుశ్రో

"మీ హృదయం నాకు తెలుసు మీ నిజాయితీకి నేను భంగం కలిగించను" అని మెల్లగా లోనికి వెళ్ళి కొన్ని బట్టలు మూట కట్టుకుని వచ్చింది

"పదండి మీతో మీయింటికి వస్తాను," అంది గంగాధర్ నుద్దేశించి

నిన్నీ వెంటనే తనతో బయలుదేరుతుందని గంగాధర్ నమ్మలేకపోయాడు నిన్నీ వస్తే సుశ్రోని చీవాట్లు పెడుతుందనుకున్నాడు గాని తనవెంట బయలుదేరుతుందని కలలోకూడా నమ్మలేక పోయాడు గంగాధర్ కాని ఇప్పుడు నిన్నీ తనతో బయలుదేరుతోంది అంటే నిన్నీ తనను గూఢంగా ప్రేమిస్తోందన్న మాట

గంగాధర్ మాటాడకుండా బైటకు నడచాడు నిన్నీ అతన్ననుసరించింది

వారిద్దరూ బైటకు వెళ్ళగానే భుజముమీద సన్న తుండుగుడ్డతో కన్నీరు తుడుచుకుని తలుపులు మూసుకున్నాడు సుశ్రో

వింతవిహారిన మతిమరుపు

ప్రొఫెసర్ల జాతికి మతిమరుపు అనేది ఎందుకు సంప్రాప్తమైంది? అనే విషయంపై ఒక ప్రొఫెసరుగారు ఏడాది పరిశోధన జరిపారు జవాబు కనుక్కున్నట్టున్నారు కూడా! ఎందుకో అంతలో మర్చిపోయారు.

2

తనభర్త వెంట వస్తున్న నిన్నీని చూసి "మైనా" మొదట తన కళ్ళను తానే విశ్వసించలేకపోయింది నిన్నీ తనభర్త వెంట మూటపట్టుకొని రావటంతో ఉద్దేశమేమిటో ఆమె కెంత ఆలోచించినా బోధపడలేదు

వాళ్ళిద్దరూ దగ్గరకు రాగానే "బాగున్నావా నిన్నీ" అని పలుకరించింది

నిన్నీ జవాబు చెప్పకుండా ముఖం దించుకుంది

"ఇలా వచ్చావేం నిన్నీ?" అంది మైనా మళ్ళీ

"పండుగకదా అని, అన్నయ్య తీసుకు వస్తానంటే వదిన అంగుళం వొచ్చాను నా అన్న ఇంటికి, అందులో పండుగపూట రావటంలో తప్పేముందమ్మా" అంది నిన్నీ

నిన్నీ మాటలు గంగాధర్ హృదయానికి సూటిగా తగిలాయి తనూహించిందేమిటి? ఇప్పుడు నిన్నీ అంటున్నదేమిటి? కథ ఇలా అడ్డం తిరుగుతుందని తాను మొదట ఊహించలేదే! నిన్నీ సౌందర్యాన్ని చూసి సోదరునివంటి మిత్రునికి ద్రోహం తలపెట్టేను వచ్చేటప్పుడు 'నిన్నీని నీవే ఉంచుకో సుశ్రో' అని మాట మాత్రమైనా చెప్పకుండా నిన్నీని వెంటబెట్టుకుని వచ్చేశాడు

తనని సోదరునివలె చూసుకుంటున్న నిన్నీని, ఆమె సౌందర్యం చూసి తనింకోలా తలపోశాడు ఎంత మిత్రద్రోహం!

సుశ్రో తనయందు చూపించే ఆదరం, ప్రేమ ఒక్కసారి కళ్ళముందు మెదిలాయి తన మిత్రద్రోహానికి ప్రాయశ్చిత్తం ఈ లోకంలో ఉండదనుకున్నాడు గంగాధర్

(56 వ పేజీ చూడండి)

★ వీడని బంధం ★

(35 వ పేజీ తరువాయి)

జానకిరామయ్య ఈ సంబంధం చేసేస్తానని బట్టుబట్టి కూర్చున్నాడు

నిష్కళంకంగా ప్రేమించినబావను తను కసిరికొట్టింది అలాంటిది నేను హృదయం లేని ఒక పశువుకు తన జీవితాన్నిలా అంకితం చేయటం?

సరోజ కాళ్లావేళ్లాబడి ప్రతిమాలుకోగా జానకిరామయ్య మనసు కరిగి "సరే, ఈ సారి వచ్చే సంబంధం మాత్రం ఖాయం" అన్నాడు

*   *   *

ఆకాశం కేసి చూసింది సరోజ మబ్బు మబ్బుగా వుంది దారిలో వర్షంలో చిక్కుకుంటే తప్ప వాళ్లు ఇంకో గడియకల్లా రానే వస్తారు గాలి జోరుగా వీస్తోంది వర్షం తేలిపోతుందేమో!

అవును! వరం తేలిపోయేటే వుంది! వాళ్లు తప్పకుండా వస్తారు! ఈలోపల తనకు 'చావు' రాకూడదూ?

సరోజ మనస్సులో నానాగందరగోళంగానూ వుంది పెను తుఫానులు చెలరేగుతున్నాయి - అగ్నిగోళాలు పగులుతున్నాయి

గతిరాత్రంతా సరోజకు సరిగా నిద్రలేదు.

శారదత్తా, శేఖర్ కాశీనుంచివచ్చి అప్పుడే మూడు, నాలుగురోజులు కావస్తోంది అయినా తను ఇంతవరకూ వాళ్లింటికి వెళ్లటానికి సాహసించలేకపోయింది

ఆనాడు బావను ఈసడించి కొట్టిన తను బావలాంటి 'మనిషి'నే వేలకు వేలు పోసి తెచ్చుకుంటున్నది హృదయమిచ్చి ప్రేమిస్తానన్న బావను పరాభవించి పంపించేసింది ముక్కూ మొఖం తెలియని ఓవ్యక్తికి తనజీవితాన్ని అప్పగించబోతున్నది ఉస్! ఏం జీవితం!

తనమనస్సువిరిగి కుమాతునకలై పోయింది. పెళ్ళి మీదా లేదు, దేని మీదా లేదు అయినా నాన్న వప్పుకోడు ఇంట్లోనుంచి ఎక్కడికన్నా పోవాలి' ఎక్కడికిపోయినా వెతికి తీసుకొచ్చి పెళ్ళి చేసేస్తాడు నాన్న.

చచ్చిపోతే నాన్నేం చేస్తాడు? అ– అదే చెయ్యాలి

వళ్లంతా మంటలు, మంటలు! శారదత్త ఇంటికివెళ్లి 'కాశీ'కబురు నాలుగువింటే నన్నా చల్లబడుతుందేమో! వద్దు, వద్దు– తను ఇంక ఎవరికీ తనముఖం చూపదలచుకోలేదు

ఎక్కడికో ఈడ్చుకుపోతున్నాయికాళ్లు వీది కనుపిస్తే అందులోనే దూకేస్తుంది. దాంతో సరి!

*   *   *

ఆకాశంలో మబ్బులు వెలుతురును అడ్డేసినయ్ అంతా మసకవెలుతురుగా వున్నది.

శారదమ్మ అలికిడిలేదు యెక్కడ 'పెత్తనం' చేయటాని కెళ్ళిందో ఏమో!"

ఆఫీసునుంచి వచ్చి ఇంట్లోకి అడుగు పెట్టబోతూ చైతన్యరహితంగా గోడకు చేరగిలబడి నిలుచుని ఆ మసక వెలుతుర్లో అస్పష్టంగా కన్పిస్తున్న ఆకారాన్ని చూసి "ఎవరదీ?" అంటూ దగ్గరగా వెళ్లాడు శేఖర్.

తీరని వ్యథతోటి, చిత్తక్షోభతోటి భయంకరంగా పాలిపోయిన సరోజ ముఖం చూసి ఖంగారుపడుతూ "అరె! ఏమయింది సరోజా?" అని అడిగాడు శేఖర్

ఏమిటిది? ఏం చెయ్యాలనుకున్నది, ఎక్కడికొచ్చిందితను! శేఖర్ ను ఏముఖంతో చూడగల్గుతున్నది.

సరోజకు గొంతుకలోంచి మాటపెగలేదు రెండు చేతులతో ముఖం కప్పుకుని నిశ్శబ్దంగా ఏడుస్తున్నది

"సరోజా!" అన్నాడు శేఖర్ మరింత కంగారుపడుతూ శేఖర్ కాళ్ళమీద కుప్పకూలిపోయింది సరోజ"

అశ్రుతప్తాలైన కళ్ళను మెల్లగా పైకెత్తి శేఖర్ ముఖంలోకి చూస్తూ హీనస్వరంతో నన్ను క్షమించగలవా బావా?" అంది

"శేఖరా! సరోజ గాని యిక్కడికొచ్చిందా? అవతల పెళ్ళి చూపులకొచ్చారు అదేమో ఎటో పోయింది!" అంటూ వీధిలో నుంచే కేకేశాడు జానకిరామయ్య గోడుగేసుకుని వస్తూ.

సరోజ హతాశురాలై, నిర్జీవంగా లేచి నిలబడింది "ఇంకా ఏం చూపులు మామయ్యా? అప్పుడే పాణిగ్రహణం కూడా అయిపోతేనూ!" అంటూ సరోజ చేయి పట్టుకుని శేఖర్ జానకి రామయ్య పాదాభివందనం చేయటానికి ముందుకొచ్చాడు ★

★ జూదాల పండుగ ★

(30 వ పేజీ తరువాయి)

గబగబలోనికివెళ్ళి తనకుపండిన పంటలో కొన్నిగింజలు మూటకట్టి, బజారుకు వెళ్లేను బజార్లో పసుపు, కుంకుమ, కొన్ని దుస్తులు తీసుకొని ఇంటికివచ్చాడు వాటిని నిన్నీ చేతికిచ్చాడు

"ఇవెందు కన్నయ్యా?" అని ప్రశ్నించింది నిన్నీ

"ఈ పేద అన్నయ్య పండుగపూట ఇంత కన్నా ఎక్కువ కానుకలు చెల్లెలి కివ్వలేడమ్మా పద! నీకోరకు సుక్రో ఎదురు చూస్తుంటాడు" అన్నాడు

పైనా, నిన్నీకి కొద్దిగా పసుపురాసి, కుంకుమతో బొట్టుపెటి సాగనంపింది

నిన్నీ గంగాధర్ కలసి సుక్రోఇంటికి వచ్చేటప్పటికి తలుపులు మూసిఉన్నాయి "పాపం భార్య వెళ్ళిపోయిందని సుక్రో ఎంత బాధపడుతున్నాడో?" అనుకున్నాడు గంగాధర్.

"సుక్రో. సుక్రో" అంటూ తలుపులు లోనికినెట్టాడు

ఎదురుగా తనకు కన్పడిన దృశ్యంచూసి పట్టరానిదుఃఖంతో కళ్లుమూసుకొని వెనక్కి తిరిగాడు గంగాధర్

నిన్నీ అడుగు ముందుకువేసి గదిలోనికి వెళ్ళింది ఎదురుగా ఇంటివాసానికి వ్రేలాడుతున్న తన భర్తశవంచూసి కెవ్వున కేక వేసి క్రిందపడిపోయింది నిన్నీ

ఆ పండుగనాటిరాత్రి విందు కురించి ప్రత్యేకించిన కోడిపుంజు "కొక్కురోకో" అని ఎన్నిసార్లు కేక వేసినా నిన్నీ మరి లేవలేదు ★

సాగరగర్భంలో సాహస యాత్ర

(48 వ పేజీ తరువాయి)

గ్రామి బాగా పలికి దిగిపోయింది. మేమంతా బలక బయట పడ్డాము గదా అని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టాము తర్వాత జలాంతర్గామి మరి కొంతదూరం ప్ర…ణం చేసింది. మా కందరికీ బాగా ఊపిరి పీల్చుకోవడానికి అవకాశం చిక్కింది.

ఇంకా వుంది.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street Madras 1 Editor S Sambhu Prasad